# సకల సౌలత్‌ల ఒడి..
# సర్కారు బడి

## స్వరాష్ట్రంలో కార్పొరేట్‌కు దీటుగా వసతులు, నాణ్యమైన విద్య



కతాల్‌గూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

- ఆంగ్ల మాధ్యమం అమలు
- సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం
- సంక్షేమ హాస్టళ్ల తరహాలో సీఎం బ్రేక్‌ఫాస్ట్
- ఉచితంగా యూనిఫామ్, నోట్‌బుక్స్, వర్క్‌బుక్స్ అందజేత
- ఉమ్మడి జిల్లాలో 2లక్షలకు పైగా విద్యార్థులకు లబ్ధి

స్వరాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ విద్యాభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంతోపాటు ఆంగ్ల మాధ్యమం అందుబాటులోకి తెచ్చారు. సర్కార్ బడులను ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం పెట్టడంతోపాటు విద్యార్థుల్లో మిటమిన్స్, ఐరన్ లోపం నివారించేలా నిత్యం రాగి జావ, పల్లిపట్టి, వారంలో మూడు సార్లు ఉడికించిన గుడ్డు అందిస్తున్నారు. దీంతోపాటు గత నెల నుంచి ఉదయం రుచికరమైన అల్పాహారం పెడుతున్నారు. నోట్‌బుక్స్, వర్క్‌బుక్స్, స్కూల్ యూనిఫామ్ అందిస్తూ పేద విద్యార్థులకు ఆర్థిక భారం లేకుండా చేశారు. తొలిమెట్టు, ఉన్నతి కార్యక్రమాలతో చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య, హాజరు శాతం పెరిగింది.

– రామగిరి, నవంబర్ 16

### ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 3,113 స్కూళ్లు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 3,113 ప్రభుత్వ పాఠశాలలుండగా.. వాటిల్లో 2,37,930 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో నల్లగొండ జిల్లాలో 1,485 పాఠశాలల్లో 1,20,877 మంది, సూర్యాపేటలో 909 పాఠశాలల్లో 63,805 మంది, యాదాద్రి భువనగిరి జిల్లాలో 719 పాఠశాలల్లో 53,248 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరందరికీ ఉచితంగా ఆంగ్ల విద్యతోపాటు అనేక సంక్షేమ ఫలాలు అందుతుండటంతో చదువులో ప్రతిభ కనబర్చుతున్నారు. మరో వైపు ప్రతి సంవత్సరం విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే సైన్స్ కాంగ్రెస్, సైన్స్ ఫెయిర్, సైన్స్ డ్రామా, అండర్–14 క్రీడా పోటీల్లో ప్రైవేట్ కంటే ప్రభుత్వ విద్యార్థులే ముందు వరుసలో ఉండి సత్తా చాటుతున్నారు.

### నాస్తతో విద్యార్థుల హాజరు శాతం పెరిగింది



ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే పేద విద్యార్థుల కడుపు నింపేలా ఉదయం అల్పాహారం అందించడం ఆదర్శనీయం. దీంతో పాఠశాలల్లో విద్యార్థుల డ్రాప్ అవుట్ తగ్గడంతోపాటు హాజరు శాతం పెరిగింది. తల్లిదండ్రులు, విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులుగా హర్షం వ్యక్తం చేస్తున్నాం. వీటితోపాటు ఉదయం రాగి జావ, పల్లిపట్టి, మూడు రోజులు ఉడికించిన కోడి గుడ్డు ఇస్తున్నాం. మధ్యాహ్నం పౌష్టికాహారం పెడుతుండడంతో కడువు నిండా తిని విద్యార్థులు చక్కగా చదువుకుంటున్నారు. మన ఊరు – మన బడితో మౌలిక వసతులు మెరుగుపడ్డాయి. దీంతో తల్లిదండ్రులకు మరింత విశ్వాసం పెరిగి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు.

**– నవ్వ దమనేశ్వర్‌రావు, ప్రధానోపాధ్యాయుడు, పద్మానగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, నల్లగొండ**

### ప్రైవేట్ కంటే ప్రభుత్వ బడులో బాగున్నాయ్



మా ఇద్దరు పిల్లలను గతంలో ప్రైవేట్ బడిలో చదివించా. అక్కడ ఫీజుల భారంతో ఇబ్బంది పడ్డాం. ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం చెప్తున్నారని తెలిసి మా పిల్లలను అందులో చేర్పించా. పెద్దోడు 5వ తరగతి, చిన్నోడు 4వ తరగతి చదువుతున్నారు. స్కూల్ యూనిఫామ్, నోట్, వర్క్‌బుక్స్ ఉచితంగా ఇవ్వడంతో ఇప్పుడు ఫీజుల భారం, ఆర్థిక బాధలు తప్పాయి. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం పెడుతుండడంతో ఇంట్లో పొద్దున్నే వంట చేసి పెట్టే ఇబ్బంది లేదు. తల్లిదండ్రులు సర్కారు వసతులను ఉపయోగించుకుని తమ పిల్లలను ప్రభుత్వ బడిలో చదివించాలి.

**– కె.శేఖర్, విద్యార్థుల తండ్రి, శ్రీరాంనగర్, నల్లగొండ**

### చదువు బాగా చెప్తున్నారు



ప్రైవేట్ స్కూల్ కంటే మా సర్కార్ బడిలోనే చదువు బాగా చెప్తున్నారు. ప్రైవేట్ బడికి అయితే టిఫిన్ బాక్స్ తీసుకొని వెళ్లాలి. పుస్తకాలు కొనాలి. ఇక్కడ ఆ బాధలు లేవు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం అన్నం, గుడ్డు, మళ్లీ రాగి జావ, పల్లి పట్టి ఇస్తారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉదయం ఇంట్లో తయారై బడికి వచ్చి టిఫిన్ చేసి, మధ్యాహ్నం అన్నం తిని చక్కగా చదువుకుంటున్నా. ప్రైవేట్ స్కూల్ కంటే మా బడిలో మంచిగా బెంచీలు, వారంలో టీవీ పాఠాలు ఉన్నాయి. బడిలో ఇచ్చిన వర్క్‌బుక్స్ చాలా బాగున్నాయి. పాఠాలు మంచిగా అర్థం అవుతున్నాయి.

**– సృష్టి, 5వ తరగతి, పద్మానగర్, నల్లగొండ**

### సర్కార్ చొరవతో ఒనగూరిన వసతులు

- మన ఊరు – మన బడి, మన బస్తీ – మన బడి కార్యక్రమాలతో సర్కార్ బడులు కొత్త నిర్మాణాలు, మౌలిక వసతులతో సర్వాంగ సుందరంగా మారాయి.
- సన్న బియ్యంతో రుచికరమైన మధ్యాహ్న భోజనం, విద్యార్థులకు పోషకాలు అందించే రాగిజావ, పల్లి పట్టి, వారంలో మూడు రోజులు ఉడికించిన కోడి గుడ్డు పంపిణీ చేస్తున్నారు.
- తల్లిదండ్రులకు ఆర్థిక భారం కావద్దనే ఉద్దేశంతో ఈ విద్యా సంవత్సరం నుంచి హైస్కూల్ విద్యార్థులకు 17 నోట్ బుక్స్, ప్రాథమిక విద్యార్థులకు వర్క్‌బుక్స్ అందిస్తున్నారు. అదేవిధంగా పాఠ్య పుస్తకాలు, రెండు జతల స్కూల్ యూనిఫామ్ ఇస్తున్నారు.
- దూర ప్రాంతాల నుంచి సర్కార్ బడికి వచ్చే విద్యార్థులకు రవాణా చార్జీలు (ట్రాన్స్‌పోర్టు అలవెన్స్) అందిస్తున్నారు.
- చదువులో వెనుకబడిన విద్యార్థులు రాణించేలా ప్రాథమిక స్థాయిలో తొలిమెట్టు, హైస్కూల్ స్థాయిలో ఉన్నతి పేరుతో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.
- విద్యార్థుల హాజరును పటిష్టం చేసేలా ఈ విద్యా సంవత్సరం నుంచే పాఠశాలలకు ట్యాబ్స్ అందజేయగా.. వాటి సహాయంతో విద్యార్థులకు ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్)తో హాజరు నమోదు చేస్తున్నారు. పాఠశాల వివరాలు, ఇతర అంశాలను సులభతరంగా పొందుపర్చుతున్నారు.
- విద్యార్థుల విద్య స్థితిని తెలుసుకునేలా ప్రతి నెలా మూడో శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహిస్తున్నారు.
- విద్యార్థులు క్రీడలు, సైన్స్ అంశాల్లో రాణించేలా ప్రోత్సాహం కల్పిస్తూ ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.
- పదో తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించడంతోపాటు చదువులో వెనుకబడిన విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.



అడవిదేవులపల్లి మండలం గోన్యాతండాలో బిందెలతో నీటిని మోసుకుంటున్న గిరిజనులు (ఫైల్)


దామరచర్ల మండలం లావూరితండాలో నీటి కోసం తిప్పలు పడుతున్న గిరిజనులు (ఫైల్)

## నాడు మంచినీటి కష్టాలు..
## నేడు ఇంటికే కృష్ణా జలాలు

దామరచర్ల, నవంబర్ 16 : సమైక్య పాలనలో దామరచర్ల మండల ప్రజలు తాగునీటికి అనేక అవస్థలు పడ్డారు. పక్కనే కృష్ణా, మూసీ నదులు.. మరో పక్క అన్నవేరు, అహల్య వాగులు ప్రవహిస్తున్నా తండాల్లో నీళ్లు దొరుకని పరిస్థితి ఉండేది. వానలు పడక, చెరువులు ఎండిపోయి భూగర్భజలాలు అడుగంటి బోరుబావులు వట్టిపోయిన దుస్థితి. ఈ క్రమంలో కూలి పనులు వదులుకొని కిలోమీటర్ల దూరం వెళ్లి నదిలో, వ్యవసాయ బోర్ల వద్ద నీళ్లు తెచ్చుకునేది.

అయితే.. స్వరాష్ట్రంలో కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నల్లాల ద్వారా శుద్ధి చేసిన కృష్ణా జలాలు అందిస్తున్నారు. నిత్యం సరిపడా మంచినీళ్లు ఇంటికే వస్తుండడంతో మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు బిందె పట్టుకొని బయటకు వెళ్లాల్సిన పరిస్థితి లేదని ఆడబిడ్డలు పేర్కొంటున్నారు.



దామరచర్ల మండలం పర్తూనాయక్ తండాలో ఇంట్లోనే మిషన్ భగీరథ నీటిని పట్టుకుంటున్న గిరిజన మహిళ